# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర బడ్జెట్‌లో 12 లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.
- ❖ చర్చలు, దౌత్య మార్గం ద్వారానే పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతను తగ్గించాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.
- ❖ పశ్చిమాసియాలో ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో 350 దేశీయ విమానయాన సేవలను రద్దు చేశారు.
- ❖ ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ సూపర్-8లో చివరి క్రికెట్ మ్యాచ్ వెస్టిండీస్, భారత్ జట్ల మధ్య కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం 12 లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దీని వల్ల దేశంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. పుదుచ్చేరిలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ఈరోజు శంకుస్థాపన చేసి.. జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, ఆరోగ్య పర్యాటక రంగాలలో పెట్టుబడులతో పుదుచ్చేరి ముందుకు సాగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పుదుచ్చేరి అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. పుదుచ్చేరి వైద్య పర్యాటక కేంద్రంగా ఎదగగలదని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో భాగంగా ఒక వెయ్యి 142.23 కోట్ల రూపాయల విలువైన 19 ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులోని మధురైలో 4 వేల 400 కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఈ రోజు చేశారు. ఈ ప్రాజెక్టులలో కుంభకోణం, యెర్కాడ్ వెల్లూరులలో 3 కొత్త ఆకాశవాణి FM రిలే ట్రాన్స్‌మీటర్లు ఉన్నాయి. ప్రాంతీయంగా, నిరంతరాయంగా FM ప్రసారాన్ని ఈ ట్రాన్స్‌మీటర్లు నిర్ధారిస్తాయి. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ప్రజా ప్రసార సేవలను పొందే అవకాశాన్ని పెంచుతాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్డీఏ ర్యాలీని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... తమిళనాడు అభివృద్ధి ప్రయాణంలో భాగంగా ఈ కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. ఆర్థిక వ్యవస్థను పెంచుతాయని, ఉద్యోగాలను సృష్టిస్తాయని నరేంద్రమోదీ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

చర్చలు, దౌత్య మార్గం ద్వారానే పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతను తగ్గించాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. పశ్చిమాసియా పరిధిలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్-నహ్యాన్‌తో ఆయన చర్చించారు. పెరుగుతున్న పరిస్థితి పట్ల భారతదేశం ఆందోళన చెందుతోందని ఈ చర్చల సందర్భంగా పేర్కొన్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా చేసిన పోస్టులో కేంద్రమంత్రి తెలిపారు. గల్ఫ్‌లో కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితి గురించి సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్‌తో, ఖతార్ ప్రధాన మంత్రి, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి, కువైట్ విదేశాంగ మంత్రులతో కేంద్రమంత్రి జై శంకర్ మాట్లాడారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ అభివృద్ధి అవసరాలను తీర్చడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలోని భంజ్‌రారు సలూనిలో జరిగిన సమావేశాలను ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 11 సంవత్సరాలుగా దేశంలో అనేక ప్రాంతాలలో విశేషమైన అభివృద్ధి సాగుతోందని గుర్తు చేశారు.  రహదారుల అనుసంధానం, బ్యాంకింగ్ సేవలతో పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలలో గణనీయమైన ప్రగతి ఉందని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భంజ్‌రారులో ఇండోర్ స్టేడియంకి ఐటీఐ భవనానికి కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ తో న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రతినిధి స్థాయి చర్చలను రేపు జరపనున్నారు. భారత్-కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా వివిధ రంగాలలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఇరువురు నాయకులు సమీక్షిస్తారు. వాణిజ్యం, పెట్టుబడి, ఇంధనం, కీలకమైన ఖనిజాలు, వ్యవసాయం, విద్య, పరిశోధన వంటి రంగాలలో కొనసాగుతున్న సహకారాన్ని కూడా అధ్యయనం చేస్తారు. ప్రాంతీయ ప్రపంచ పరిణామాలపై ఇద్దరు నాయకులు అభిప్రాయాలను పంచుకుంటారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. మధ్యవర్తిత్వం వల్ల అనేక కేసులు సులువుగా పరిష్కారం అవుతాయన్నారు. అమరావతిలో మధ్యవర్తిత్వంపై ఈరోజు నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి సమస్యకు న్యాయస్థానికి రావడమే పరిష్కారం కాదని చెప్పారు. కుటుంబ తగాదాల వల్ల కోర్టులలో కేసులు బాగా పెరుగుతున్నాయన్నారు. మధ్యవర్తిత్వం వల్ల న్యాయం జరుగుతుందని ఇరుపక్షాలకు నమ్మకం ఉండాలని చెప్పారు. కొన్ని కేసులలో కోర్టులు కూడా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలని సూర్యకాంత్ సూచించారు. మధ్యవర్తిత్వానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతోందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్)

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో భారత దేశీయ విమానయాన సంస్థలు నడుపుతున్న మొత్తం 350 విమానాల సేవలను రద్దు చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా పెట్టిన పోస్టులో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ విషయం వెల్లడించింది. అదే విధంగా పశ్చిమాసియా దిశగా నడిచే అంతర్జాతీయ విమానాలు ఆలస్యం లేదా షెడ్యూల్‌లో మార్పులను ఎదుర్కోవాల్సి రావచ్చునని ఆ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా వెస్టిండీస్, భారత్ జట్ల మధ్య కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా చివరి క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కొనసాగించిన వెస్టిండీస్ 16 ఓర్లకు 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా.. మిగిలిన ఒక స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ మ్యాచ్‌లో భారత్, వెస్టిండీస్ జట్లు పోటీపడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ మధ్య  వైమానిక దాడుల నేపథ్యంలో ఆయా దేశాలలో ఉన్న భారతీయ ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పశ్చిమాసియాలోని భారత రాయబార కార్యాలయాలు కోరాయి. ప్రస్తుతం నెలకొని ఉన్న ప్రాంతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జారీ చేసిన అధికారిక సూచనలు, సలహాలను పాటించాలని పేర్కొన్నాయి. అత్యవసర సమయంలో సకాలంలో సహాయం అందించడానికి రాయబార కార్యాలయాలు 24 గంటలూ సిద్ధంగా ఉన్నాయని వెల్లడించాయి. అలాగే హెల్ప్‌లైన్ నంబర్లు, ఇమెయిల్ ఐడిలను కూడా ఈ రాయబార కార్యాలయాలు విడుదల చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో ఉద్రిక్త  పరిణామాల నేపథ్యంలో వీసా పొడిగింపు లేదా ఇతర సహాయం కోసం భారతదేశంలోని విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం (FRRO)ను సంప్రదించవచ్చని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. సంబంధిత FRRO వారికి అవసరమైన సహాయం చేస్తుందని తెలిపింది. అవసరమైన వారు www.boi.gov.inలో సంప్రదించవచ్చునని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =